## 7. పనిచేసే వాళ్ల కథ

**మొన్నీ** మధ్య ఓ పని నెత్తిమీద వేసుకుని ఒక మినిస్టర్‌గార్ని కలుద్దామని హైదరాబాదు వెళ్లేను. ఎందుకేనా మంచిది; మినిస్టర్‌గార్ని అనుకున్నపళంగా కలుసుకోలేకపోతే రెండు రోజులు ఉండవలసి రావచ్చు; అని ఆలోచించి - అట్నుంచి రావడానికి రెండు రోజుల తరవాతి నాటి రైలుకి టిక్కెట్టు కొనుక్కున్నాను.

వెళ్లిన రోజున ఉదయం ఏడున్నరకి హోటల్లో దిగేను. ఎనిమిదింటికి మినిస్టర్ గారింటికి ఫోన్ చేసేను. పి.ఏ.గారు పలికేరు. నాపేరు, ఊరు, నేనొచ్చిన పనీచెప్పి; ఎలాగైనా మినిస్టరు గార్ని కలిసేటట్టు చూడమని ప్రార్థించేను. "ఒక్క నిమిషం లైన్‌లో ఉండండి" అన్నారు పి.ఏ.గారు. సరేకదా అని ఉన్నాను. నిమిషం అయింది.

"మీ రిప్పుడెక్కడున్నారు? ఓ అరగంటలో వచ్చేగల్రా? మినిస్టర్ గారు ఇవాళ పదకొండు గంటలకి బయల్దేరి కర్నూలు వెళ్లిపోతారు. మళ్లా నాలుగు రోజులదాకా రారు" అన్నారు పి.ఏ. గారు.

ఉన్నపళంగా లేచి వెళ్లేను. మినిస్టర్ గార్ని కలిసేను. ఆయన, నా పని మీద శ్రద్ధ తీసుకున్నారు. నా ఎదురుగానే ఎవరికో టెలిఫోన్ చేసి మాట్లాడేరు. అది అయిపోయాక నాతో చెప్పేరు. ఫలానా ఆఫీసులో ఫలానా మనిషిని సాయంకాలం నాలుగు ప్రాంతంలో కలిస్తే ఆర్డర్ ఇచ్చేస్తారుట. నా అదృష్టం బావుంటే ఆరోజు బండికే తిరుగు ప్రయాణం కట్టేయొచ్చుట.

మినిస్టరు గారు నాలుగ్గంట్లని చెప్పేరు. అయినా ఎందుకేనా మంచిదని మూడు గంటలకే ఆ ఆఫీసుకి వెళ్లేను. అప్పటికే ఆర్డరు తయారైపోయింది. కాని; మినిస్టరు గారి మనిషిని కదా అన్న గౌరవం చేత ఆ పెద్దమనిషి నన్ను కాఫీ తాగకుండా వెళ్లనివ్వనన్నాడు. దానికి గంట పట్టింది. "టీ అయితే మా ఆఫీసు పక్కనే దొరుకుతుంది. మీరు కాఫీ అన్నారు కదాని కారిచ్చి హిమాయత్‌నగర్ దాకా పంపేను. సారీ" అన్నాడాయన.

హోటల్‌రూమ్‌కి వచ్చి రైల్వే రిజర్వేషన్ ఆఫీసుకీ; నాకు బాగా పరిచయం ఉన్న ట్రావెల్ ఏజన్సీకీ ఫోన్లు చేసేను - ఇలా యిలాగ, ఎనిమిదో తారీకు టిక్కెట్టు; ఆరో తారీకు బండికి ప్రీ - పోన్ చేయించగలరా! అంటూనూ. ఆరూ ఏడూ రెండు తారీకులూ నోరూమ్ అనేసేరు.

అలాగ; అనుకుంటే జరగనివి అనుకోకుండా జరిగి; కొంచెం టైమూ కొంచెం డబ్బూ మిగిలేయి; నా దగ్గిర. "టైమ్ ఈజ్ వేస్టాఫ్ మనీ" అన్నాడొక పాశ్చాత్యుడు; తన వగరు పొగరు రాతల్లో. అయినా సరే, రెండూ వృథా చెయ్యడానికి సిద్ధపడిపోయేను.

"ఎప్పుడొచ్చినా ఓ కాలు గదిలోనూ రెండో కాలు వరండాలోనూ వేసుకుని వస్తావు. అలా అడావుడిగా రాకపోతేనూ, రెండ్రోజులుండేటట్టుగా రాకూడదూ?" అని అధికారంగా, వ్యంగ్యంగా, ఆపేక్షగా కూడా అడిగేవాళ్లు హైదరాబాదులో ఐదారుగురు మిత్రులు వున్నారు. ఈ ట్రిప్పులో వాళ్లందరి సరదా తీర్చెయ్యాలని నిశ్చయించుకున్నాను. విఘ్నేశ్వరరావు, రవణమూర్తి, కార్తికేయన్, ఇబ్రహీం, ఏకాంబరం - ముఖ్యంగా ఐదారుగురున్నారు. చదువుకునే రోజుల్లో ఒరే అంటే ఒరే అని పిల్చుకునేవాళ్లం. ఏడో తారీకుని కొందర్నీ ఎనిమిదో తారీకుని మిగిలిన వాళ్లనీ కలవొచ్చు కదాని స్కీము వేసుకున్నాను.

ఒక్క విఘ్నేశ్వరరావు తప్పా అందరూ గవర్నమెంటు ఆఫీసుల్లోనే పన్లు చేసుకుంటున్నారు. విఘ్నేశ్వర్రావు ఒక ప్రయివేట్ కంపెనీలో రిటెయినర్ పద్ధతిని పనిచేస్తున్నాడు. "నీకు పనిరోజులూ వర్కింగు అవర్సూ అంటూ ఏం ఉండవు. మేం పిలిచినప్పుడల్లా ఆఫీసుకొస్తూ మేం చెప్పిన పనల్లా వేగిరం చేసేస్తే చాలు. నువ్వు మాకు అందుబాటులో ఉండే ఒక పి.పి. ఫోన్ నెంబరు ఇయ్యాలి" అని అతని ఎపాయింట్‌మెంటు ఆర్డర్‌లో ఉంది. అంచేత ముందుగా విఘ్నేశ్వర పూజ అలవాటూ ఆనవాయితీ అయినా కూడా అతన్ని పక్కని పెట్టేశాను.

ఉదయం పదిన్నరకి రవణమూర్తి ఆఫీసుకు ఫోన్ చేసేను. ఓ పాతికసార్లు మోగేక అట్నించి "హలో" ఒచ్చింది. నా పేరూ ఊరూ చెప్పి రమణమూర్తిని పిలవమన్నాను. "ఇంకా రాలేదు సార్. నేనా, సర్? ఆఫీస్‌బోయ్ సార్! పదకొండు గంటలకి అందరూ వచ్చేస్తారు సార్. యస్సార్. చెప్తాను సార్."

సరేకదా అని పదకొండు గంటలయ్యేక బయలుదేరేను. కొంతదూరం సిటీబస్సూ మరికొంత దూరం ఆటో, అలా; రవణమూర్తి ఆఫీసుకి చేరేసరికి పదకొండున్నర అయింది టైమ్. అతని సెక్షన్ వెతికి పట్టుకుని అక్కడ చూస్తే రవణమూర్తి లేడు. "ఒచ్చేరు సార్. కేంటీన్ కెళ్లుంటారు సార్. అవును సార్. మీతో ఫోన్‌లో మాట్లాడింది నేనేసార్. కూర్చోండిసార్" అని ఆఫీసుబోయ్ చెప్పేడు కదా అని కూర్చున్నాను. ఓ పావుగంట కూచునేసరికి ఆ బోయ్ మళ్లీ వొచ్చి "కేంటీన్‌కెళ్లి చూడండి సార్; గ్రవుండుఫ్లోర్‌లో ఉంది. అక్కడ లేకపోతే గేటు బయట సర్క్యులేషన్ లైబ్రరీ దగ్గిర పేపరు చదువుతూ వుండొచ్చు సార్. అక్కడా లేకపోతే లావెట్రీ దగ్గిర ఉండొచ్చు సార్" అని చెప్పేడు. లేవట్రీలు అన్ని ఫ్లోర్లలోనూ ఉన్నాయట.

అవన్నీ తిరగలేక ఓ కాగితం అడిగి తీసుకుని మా రవణమూర్తికి చీటీ రాసేను. "నిన్న ఒచ్చేను. రేపు తిరుగు ప్రయాణం. నా రైలుకి సాయంకాలం 4-15కి బయలుదేరాలి. అయినా నేను 3-45కే రైల్లో కూర్చుంటాను. ఎస్-త్రి అనే బోగీలో పదిహేడో బెర్తు. వీలుచేసుకునిరా. ఈ సాయంకాలం ఏడు గంటలనించీ రేపు ఉదయం పదకొండు దాకా హోటల్ రూంలో ఉంటాను" - అని రాసి హోటల్ పేరూ, రూంనెంబరూ, ఫోన్ నెంబరూ రాసేను.

అక్కణ్ణించి కార్తికేయన్ పనిచేసే ఆఫీసుకి వెళ్లేను. అతని సీటుకి ఎదురుగా ఉన్న టేబిలు మీద ఒక ఫైలు తెరిచిపెట్టి ఉంది. దాని మీద రెండు ప్రశస్తమైన పేపరు వెయిట్లు ఉన్నాయి. పక్కసీట్లో పనిచేస్తున్నాయన్ని అడిగాను. "ఆఫీసరుగారు ఏదో డిస్కస్ చెయ్యడానికి రమ్మంటే వెళ్లంటాడు. లేకపోతే ఫోన్ ఒస్తే మాట్లాడ్డానికి వెళ్లంటాడు. రాస్తూ రాస్తూ ఉన్న ఫైలు తెరిచిపెట్టి వెళ్లేడంటే ఇందమ్మాటే ఎక్కడో ఉన్నాడన్నమాటే కదా!" అని నవ్వుతూ సమాధానమే చెప్పేడు. కూర్చున్నాను.

మరో పావుగంటకి ఒక తెల్ల యూనిఫారం, ఇత్తడి బాడ్జీ పెట్టుకున్న ఒకడొచ్చి ఆ టేబిల్ మీద పెట్టేడు; ఒక అట్ట దస్త్రం. 'పదహారు ఫైల్స్ సార్. కార్తికేయన్ సారొస్తే అప్పగించండి సార్' అని అతను పురమాయించకపోతే నేను వెంటనే వెళ్ళిపోయుందునేమో. కాని, మూడు గంటల వేళ వరకూ అతను రానేలేదు. అప్పుడైనా అతను రాలేదు. వాళ్ల సెక్షన్ సూపరింటుగారుట, ఆయనొచ్చేరు. ఆయన నన్ను చూసి జాలిపడి "ఇంకా కార్తికేయన్ కోసం కూచున్నారా? అతనింక ఇవాళ్టికి రాడేమోనండీ" అన్నాడు. "మరి, రాస్తూ రాస్తూ వున్న ఫైలు" - అన్నాను. "అదంతే. ఎవరైనా పెద్ద అధికారులు ఒచ్చి చూస్తే ఇతనిక్కడ ఉన్నట్టు సూచన జరుగుతుంది."

"ఇవేవో పదహారు ఫైల్సుట, కమీషనర్ గారు చూసినవిట. జాగర్త అని చెప్పి ఆ ప్యూన్ ఇచ్చేడండీ. వీట్లో ఏవైనా ముఖ్యమైన ఫైల్సు ఉన్నాయేమో?" అన్నాను.

"అబ్బబ్బ! ఇక్కడున్న ఫైల్సులో ముఖ్యం కాని ఫైలంటూ ఏదీ ఉండదండీ బాబూ. మీరు లేచి వెళ్లి మీ పన్లు చూసుకోండి!"

కార్తికేయన్‌కి కూడా నేను వచ్చిందీ, వెళ్తున్నదీ, బసా, రూం నెంబరూ, ఫోన్ నెంబరూ, రైలు నెంబరు, బోగీ నెంబరూ, బెర్తు నెంబరూ - అన్నీ చీటీ మీద రాసి పెట్టి బయటికొచ్చేను.

అక్కణ్ణించి తిన్నగా ఓ ఆటో చేసుకుని ఇబ్రహీం పనిచేసే ఆఫీసుకి వెళ్లేను. ఇబ్రహీం పనిచేసే సెక్షను ఆ బిల్డింగులో ఐదో అంతస్తులో ఉంది. ఎలా లేదన్నా ఐదు ఇరవైలు నూరు మెట్లు కదా, ఆయాసం వస్తుందేమోనని లిఫ్టు కోసం ఆగేను. దాని ధర్మమా అని లిఫ్టు ఒకటీ రెండూ మూడంతస్తుల దగ్గిర ఆగకుండా నాన్‌స్టాపుగా నాలుగో అంతస్తు వరకూ వెళ్లిందని సంతోషిస్తూ వుంటే అక్కడ; కిందికెళ్లినపుడు నాలుగులో ఎందుకాపలేదూ అంటూ ఎవరో లిఫ్టు ఆపరేటర్‌తో తగువు పెట్టుకుని ఎలాలేదన్నా ఐదు నిమిషాలు ఆపేసేడు లిఫ్టుని. తీరా తగువు తెల్లారి నేను ఐదో అంతస్తులో దిగి ఇబ్రహీం సెక్షనుకి వెళ్లేసరికి అతని టేబిలు క్లీన్‌గా, షెల్ఫు తాళం పెట్టీ ఉన్నాయి. "ఇబ్రహీం సెలవు పెట్టేడా?" అని అడిగేను.

"లేదండీ. ఇవాళ శుక్రవారం కదా. నమాజుకెళ్లడం రివాజు. జనరల్ పెర్మిషన్ వుంది. కనక వెళ్లిపోయుంటాడు. మీకు లిఫ్టులో ఎదురైవుండాలే!"

"అతను నమాజుకి ఏ మసీదుకి వెళ్తాడు?" అని నేను అడగ్గానే వాళ్ల మొహాలు చూసుకున్నారు. ఒకాయన మాత్రం తెగించి "మీ కతని ఇల్లు తెలిస్తే వెళ్లిపోండి" అన్నాడు.

నేను బయల్దేర బోతుంటే ఇంకో ఆయన నన్ను ఆపి; "మిష్టర్! మీరతన్ని ఖచ్చితంగా ఇవాళే కల్సుకోవాలంటే సాయంకాలం ఐదున్నరకి ఇక్కడికే రండి" అన్నాడు.

"ఐదు గంటలకి ఆఫీసు మూసేస్తారు కదా" అన్నాను.

"రూల్ ప్రకారం అంతే అనుకోండి. కాని, మన ఇబ్రహీమ్‌కి అలా కుదరదు. వాళ్ల ఆఫీసరు గారు మధ్యాన్నం భోజనానికి ఇంటికి వెళ్లి ఒకనిద్దర తీసి మళ్లీ ఐదున్నరకి ఆఫీసుకొస్తారు. అప్పుడు ఆయనా ఇబ్రహీమూ కూచుని ముఖ్యమైన ఫైల్సు మీద కీలకమైన నోట్సు రాస్తారు. రాత్రి ఎనిమిదిన్నరకి ఇళ్లకి వెళతారు" అన్నాడతను.

"నువ్వు ఈ రాత్రి ఎనిమిదిన్నర వరకు ఆఫీసులో ఉంటావని తెలుస్తోంది. ఏడుదాటేక ఫోన్ చెయ్యి. వీలుంటే ఏకాంబరాన్ని కూడా పట్టుకో" అని అదనపు వాక్యాలతో చీటీ రాసి అక్కడ పెట్టేను.

మర్నాడు ఉదయం పదిన్నర అయ్యేదాకా రెండు వార్తాపత్రికలతో కాలక్షేపం చేసి మళ్లీ నా మిత్రుల కోసం వేటలో పడ్డాను.

నిన్నను ఇంత తిరుగుడు తిరిగినా విఘ్నేశ్వరరావు సంగతి పట్టించుకున్నాను కాదు. అదే బెడిసికొట్టిందేమో అని అనిపించి - ఈరోజు నా మిత్రాన్వేషణ విఘ్నేశ్వరరావుతో మొదలు పెట్టడానికి నిశ్చయించేను. ఫోన్ నెంబర్ల లిస్టు తీసి అతని ఆఫీసుకి ఫోన్ చేసి నాకు కనెక్షన్ యిమ్మని మా హోటల్ టెలిఫోన్ ఆపరేటరుకి చెప్పేను.

వచ్చింది.

"హలో గుడ్ మార్నింగ్. కె.ఎస్.లిమిటెడ్."

"గుడ్‌మార్నింగ్. నా పేరు గోపాలం. విఘ్నేశ్వర్రావు కోసం."

"ఆయన ఎం.డి. ఛేంబర్స్‌లో ఉన్నారండి."

"అంటే - ఆఫీసు కొచ్చేడన్నమాటేగా! ఓ.కే. నేను అక్కడికే వచ్చేస్తాను. పావుగంట సేపు అతన్ని ఎక్కడికీ వెళ్ళిపోవద్దని చెప్పండి. థ్యాంక్యూ."

విఘ్నేశ్వరరావు ఆఫీసు చాలా శుభ్రంగా వుంది. సెక్యూరిటీ రూం దగ్గిర నన్ను ఆపిన ఉద్యోగి ఒక చేత్తో శాల్యూట్ కొడుతూనే రెండో చేత్తో ఒక రిజిస్టర్ నా ముందుకి తోసేడు. దాంట్లో ఉన్న కోలంస్ ప్రకారం నాపేరూ, అడ్రసూ, ఎవర్ని కలుసుకోవాలని వచ్చేను, టైమెంత - అన్నీ రాసేను. అతను తన ఎదురుగా ఉన్న ఒక ఫోన్‌లో ఒక నెంబరు తిప్పి "సార్, తమరికోసం విశాఖపట్నం నుండి గోపాలంగారు వచ్చేరు సార్. పంపమంటారా?" అని అడిగి - "మంచిదిసార్, అలాగే సార్;" అని చెప్పి; ఒక మనిషిని

తోడు ఇచ్చి నన్ను లోపలికి పంపేడు. ఆఫీసుకొచ్చే ఆగంతకుల్ని ముష్టి వాళ్లలాగానో దొంగల్లాగానో చూడకుండా మర్యాద చేసినందుకు సరదా వేసింది.

విశ్వేశ్వర్రావు ఒక అద్దాలగదిలో ఉన్నాడు. "నువ్వు ఉన్నావు. సంతోషం" అన్నాను.

"ఉండకేమవుతాను?"

"అడక్కు. నిన్నునంతా మన మిత్రులకోసం ఏకతిరుగుడు అయింది!" అని సగం చెప్పేను. 'నీకు ఈ ఉద్యోగం ఇస్తూ ఈ కంపెనీ వాళ్లు ఇచ్చిన ఆర్డరు నేనూ చదివేను కదా; వారానికి మూడు రోజులూ అదంతాను! అంచేత నువ్వూ దొరకవేమో అనుకున్నాను."

"అదేం కుదర్లేదు. వారానికి మూడు రోజులేమిటి; ఎనిమిదేసి రోజులుండవలసి వస్తోంది. పైగా -" అని చుట్టూ ఉన్న అద్దాల గోడలు చూపిస్తూ అన్నాడు : "ఈ ఆఫీసులో ఎం.డి. దగ్గిర్నుంచి డిశ్పాచి గుమస్తా దాకా నేనిక్కడున్నానో లేదో ఎప్పటికప్పుడు కనబడుతూ వుంటుంది. ఏం చేస్తున్నానో కూడా తెలుస్తుంది. నాకు ఏ పని పురమాయించాలన్నా ఇదుగో ఈ ఫోను మీద చెప్పేస్తారు. ఆఖరికి "టీ" కి కూడా నేను లేచి వెళ్లక్కర్లేదు. ఈ బటన్ నొక్కితే రెండు నిమిషాల్లో టీ ఒస్తుంది. కంపెనీ పని మీద నేనుగాని బైటికి వెళ్లవలసివస్తే - ఇదుగో - ఈ పుస్తకంలో - ఎక్కడికి వెళ్తున్నానో, ఎన్నిగంటల ఎన్ని నిమిషాలకి బైలుదేరుతున్నానో, మళ్లీ ఎప్పుడు రాగలుగుతానో, నేను వెళ్లేచోట ఫోన్ నెంబరు ఏమిటో - అన్నీ రాసి వెళ్లాలి."

"ఇలాంటి నిబంధనలు మనమిత్రులెవరికీ ఉన్నట్టు లేదు. ఉంటేవాళ్లని నిన్ననే కలుసుకోగలిగి ఉండేవాణ్ణి."

"నువ్వింకా ఏకాంబరం ఆఫీసుకి వెళ్లలేదంటున్నావు. అక్కడ ఆ సెక్షన్‌లో ముగ్గురుంటారు. పదిన్నరకి రావాలి. పదకొండున్నరకి వస్తారు. ఒచ్చిన పావుగంటకి కేంటీన్‌కి వెళ్ళిపోతారు. మళ్లా పన్నెండున్నరకి వస్తారు. ఒంటిగంటకి లంచిరూమ్‌కెళ్లి రెండున్నరకి వస్తారు. మూడు గంటలకి టీకి వెళ్తారు. పావు తక్కువ నాలుక్కి వస్తారు. నాలుగున్నరకి దుకాణం కట్టేస్తారు. సిటీబస్సులు దొరకవని ఒకడూ ఒకడూ జారుకుంటారు. సీట్లో మాత్రం కళ్ళజోడో, కాళ్లజోడో, కోటో, టోపీనో - ఏదో ఒకటి వదిలేసి వెళ్తారు. ఎవరొచ్చి చూసినా ఆ మనిషి ఆఫీసుకొచ్చేడు గానీ పాపం ఏదో పనిమీద అందమ్మటే ఉన్నాడని అనిపిస్తుంది. టీ తాగుతావా?"

"ఒద్దులే. నువ్వు ఖాళీగా వుంటే కొంచెం అలా బైటికి వెళ్లి కబుర్లు చెప్పుకుని ఏదైనా హోటల్లో కాఫీ తాగి వద్దాం; పద" అన్నాను.

"సారీ బ్రదర్. ఎం.డి. గారు ఆఫీసులో ఉన్నారు. ఏ పని మీద ఎప్పుడు పిలుస్తారో! నేను నీతో వచ్చేస్తే ఆయన బాధపడతారు."

అక్కడే మూడు నిమిషాలు కూర్చుని నా యోగక్షేమం చెప్పి అతని భోగట్టాలు కనుక్కుని బైటికొచ్చేశాను.

ఆ సాయంకాలం అనుకున్న ప్రకారం రైలు స్టేషనుకి; రైలు బయల్దేరడానికి అరగంట వ్యవధి ఉండగానే చేరుకుని బండిలో నా సీట్లో కూర్చున్నాను.

రవణమూర్తి, కార్తికేయన్, ఇబ్రహీం, ఏకాంబరం అందరూ వచ్చి నాకు వీడ్కోలు చెప్పేరు. నాకు వీడ్కోలు చెప్పడానికి గానూ నా చీటీలు చూసుకుని ఆఫీసుటైం అని సంకోచించకుండా వాళ్ళ రైలుస్టేషను కొచ్చినందుకు నేను వాళ్ళని మందలించలేదు. నాకు తెలుసు; ఈ పనిమీద కాకపోతే ఇంకో పనిమీద అయినా వాళ్ళు అలా బైట తిరుగుతూనే ఉంటారని.

('రచన' మాసపత్రిక : ఉగాది 1992)